# అమరజ్యోతి

ఆంగ్లేయుల నిరంకుశ పాలనను సంతమొందించి దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించే ప్రయత్నంలో పంతొమ్మిదవ శతాబ్దపు పూర్వార్ధంలోనే కంపెనీ వారితో ప్రప్రథమంగా ఖండఖండ నము సలిపిన కిత్తూరు వీరరాణి చెన్నమ్మ అమరగాథ. ఈ పోరాటాన్ని 1857 నాటి స్వాతంత్ర్య సమరానికి భూమిక అనవచ్చు. ఈ రచనకు శ్రీ కాశీనాథస్వామి హిరంగమఠ్, శ్రీ శంకరవామ్‌గార్ల భాషాంతర వ్యాసము ఆధారము — రచయిత.

బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీవారి ముఖ్య కేంద్రమగు ధార్వాడ నగరం. ఆ నగరాని కొకపక్క, ఆమ్ర కదళీ తరుచ్ఛాయల నడుమ సువిశాలమగు ఆంగ్ల భవన మొకటి దేదీప్యమానంగా వెలిగిపోతూంది. ఆ సౌధం విశాలమగు మధ్యగదిలో గుండ్రని మేజాబల్ల ముందు మెత్తని దిండ్లు సమర్చిన ఆసనంలో ఒక తెల్లదొర ఆసీనుడై ఉన్నాడు. అతని చేతుల్లో ఏవో పత్ర మొకటుంది. తీక్ష్ణమగు దృక్కులతో దా న్నతడు పరికిస్తున్నాడు. ధార్వాడకు కలెక్టరుగా నియమితుడైన థేకరే మహాశయు డతను!

రెసిడెంటు థేకరే దొర ఆంగ్లేయుల కొక ప్రధానమగు పొలిటికల్ ఏజెంటు. తమ రాజ్యాన్ని దేశంలో విస్తరింప చెయ్యడానికి వేవిధాలైన సీహాతిసీనమగు కుట్రలు, కుయుక్తులు నెరప బూను [illegible] రాజనీతి కోవిదుడు. మహా [illegible]. అంతకుమించిన స్వార్థ [illegible].

"హుం, కిత్తూరు రాణీగారి ఔద్ధత్యం రోజురోజూ శ్రుతిమించి రాగాన పడుతూంది! ఒకప్పుడు [illegible] [illegible] శాంతి అక్షుణ్ణంగా నిలపడమే ఈ ఉత్తరం వ్రాయడంలో ఆమె ఉద్దేశ మట! అవసరమైతే అందుకోసం రక్తమైనా ధారపోస్తుందట! ఎంత సాహసంచకి!" అంటూ ఆ పత్రాన్ని ఎల్లప్పశెట్టి ముందుంచాడు థేకరే దొర.

"చెన్నమ్మరాణి స్వభావం నాకు తెలియనిది కాదు. బాగానే తెలుసు. ఇన్నాళ్ళుగా ఆమెవద్ద పనిచేసే నేను ఆమె అహంకారాన్ని తెలుసుకోలేనంతటి అమాయకుణ్ణి గాను. అంతేకాదు, ఆమె చాలా పట్టుదలగల మనిషి! ఒక మాట అన్నాడే అంటే దాన్ని అక్షరాలా జరిపే తీరుతుంది. అందుచేతనే మనం కొంచెం జాగ్రత్తగా వ్యవహరించాలని మొదటి నుంచీ నేను తమతో మనవి చేసుకొంటున్నాను" అంటూ ఎల్లప్పశెట్టి ఆ ఉత్తరాన్ని అతి భద్రంగా తన అంగరఖా జేబులో పెట్టుకున్నాడు.

"సరే. మీరే చూస్తారుగా! ఆమె కొరివితో తల గోక్కోడానికి తలపడింది. ఇంక చెన్నమ్మ నా దేవుడుకూడా రక్షించ లేడు."

"అవును. అందుకే నేను తమ నాశ్రయించి చేతనైన సహాయం చెయ్యాలని సంకల్పించాను. సర్వశక్తి సంపన్నులైన తమరి ముందు, పిల్లి ముందు ఎలుకపిల్లలాగ అలలయగు చెన్నమ్మ చెలగాటమాడ సమకట్టి తన అంత్యకాలం ఆసన్నమయిందని తెలుసుకోలేక పోతూంది. ఈ తరుణంలో నేను చెప్పిన ప్రకారం మనం బయలు దేరకపోతే కిత్తూరు సంస్థానం కంపెనీ వారి హస్తగతం కావడం కష్టసాధ్య మవుతుంది."

థేకరే దొర పొడవైన తన కోటు కాలర్‌పై చేతులు వేసుకొని ఒకింత ఆలోచనామానసముగ్ను డయ్యాడు.

"మీ మాట తప్పక పాటిస్తాం. కిత్తూరు నిప్పుడు వశపరుచుకోవడం మా ముఖ్య కార్యం. తరవాత మా ప్రతినిధిగా మీ రక్కడుందురు గాని. కిత్తూరుని వశపరుచుకోవడానికి దండెత్తి వస్తున్నట్లు మే మిప్పుడే కిత్తూరు రాణికి ఉత్తరం వ్రాస్తాం. మీరు మీ విడిదికి వెళ్ళండి."

* * *

పద్దెనిమిదవ శతాబ్దపు పూర్వార్ధంలో



రాజా మల్లసర్జ కర్నాటక దేశాంతర్గతమైన కిత్తూరు సంస్థానాన్ని పరిపాలించాడు. అతడు స్వాభావికంగా గంభీరుడు. ధీరుడు. ఉదారుడు. ఆత్మాభిమాని. సాహిత్య కళా పోషకుడు. మహత్వాకాంక్షి. మహోద్దండ ప్రచండ సాహసికుడు. ఇంతటి సద్గుణసముపేతుడైన మల్లసర్జ యశోగాథను విని ఈర్ష్య జెందిన పూనా పటవర్ధనుడు మైత్రి అనే ముసుగుతో ఇతనిని ఖైదు చేశాడు. అయినాసరే, మల్లసర్జ అధైర్యం చెందక కుక్కచావు చచ్చేకంటే సింహం లాగ మృతి చెందడానికే సమయం కోసం ప్రతీక్షించ సాగాడు. కాని విధి వక్రించింది. జన్మభూమిని పునర్దర్శనం చేసుకొనే భాగ్య మా రాజసింహుని లలాట రేఖల్లో లిఖింపబడలేదు. అయినప్పటికీ అతని చిన్నరాణి చెన్నమ్మ అత్యుత్తమగు అతని ఆత్మకు శాంతిని కలిగించేందుకు కంకణం కట్టుకుంది. దేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడానికి దీక్ష బూనింది. అందుకోసం చివరకు ప్రాణాలయినా త్యజిస్తానని ప్రతిజ్ఞ పట్టింది.

చెన్నమ్మరాణి కాకతీయ రాజవంశంలో 1778 లో జన్మించింది. సౌందర్యరాశి అయినందువల్ల తలిదండ్రులగు పద్మావతి, ధూలప్ప దేశాయ్‌లు ఈమెకు చెన్నమ్మ అని నామకరణం చేశారు. బాల్యంలోనే ఈమెకు గుర్రపు స్వారి, కత్తి తిప్పుట, వేటాడుట, బల్లెములు విసరుట మొదలైన యుద్ధకళలు తండ్రినుంచి వారసత్వరూపంలో సంక్రమించాయి. జంగమగురు సాన్నిధ్యంలో కన్నడ, సంస్కృత, మరాఠీ ధర్మగ్రంథాలను అధ్యయనం చేసి ఆకళింపు చేసుకుంది.


యుక్తవయస్సు రాగానే కిత్తూరు రాజా మల్లసర్జతో ఈమెకు వివాహం జరిగింది. శివబసవరాజనే కుమారుడు కలిగాడు. కాని బాల్యంలోనే శివబసవరాజ గతించాడు. పెద్దభార్య అయిన రుద్రమ్మకు శివలింగ రుద్రసర్జ అనే కుమారుడు ఉన్నాడు. మల్లసర్జ మరణానంతరం చెన్నమ్మరాణి ఈ బాలునిచేత సుయోగ్యమగు తన మార్గదర్శకత్వంలో రాజ్యాన్ని పరిపాలింపజేసింది.

ఆ నాడు కిత్తూరు ప్రముఖ వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. వజ్ర వైడూర్యా లమ్మే బజారులుగూడా కిత్తూరులో ఉండేవి. దేశ విదేశాల నుంచి బేహారులు వచ్చేవారు. భోగభాగ్యాలతో తులతూగే కిత్తూరు, మధ్యయుగంనాటి విజయనగర సామ్రాజ్యాన్ని తలపింపజేసేది. ప్రజావత్సలులగు ఆనాటి ప్రభువుల పాలనలో కిత్తూరు ప్రజలు సుఖశాంతులతో హాయిగా ఉన్నారు.

కాని కాల మొకేరీతి గడవదు! శివలింగ రుద్రసర్జ జబ్బుతో మంచం పట్టాడు. కోటి దేవుళ్లకు మొక్కుకున్నా, లక్ష ప్రయత్నాలు చేసినా ఆ మాయదారి రోగ మతన్ని మృత్యుదేవతకే అప్పగించింది. అప్పటి కింకా శివలింగ రుద్రసర్జకి సంతానం లేదు. అందుచేత చెన్నమ్మ తన దగ్గరి బంధువగు మాస్తమారడి కుమారుడైన శివలింగప్పని దత్తత చేసుకొని అతన్నే ప్రభువుగా ప్రకటించింది. యువరాజా శివలింగప్ప ఇంకా చిన్నవాడైనందువల్ల స్వయంగా చెన్నమ్మే రాజకార్యాల్ని చూడసాగింది.

రుద్రసర్జ బ్రతికిఉన్న నాటినుంచే చిన్నరాణి చెన్నమ్మ సకల రాజకార్యాల్ని నిర్వహించి చక్కదిద్దుకోవడాన్ని చూచిన ఎల్లప్పశెట్టి, వెంకట్రావు అనే ఇరువురు రాజోద్యోగులకు కంటగింపుగా ఉండేది. ఒక స్త్రీముందు శిరస్సు వంచడం వారికి చిన్నతన మనిపించింది. కంటగింపల్లా ఆఖరికి వారి మానసక్షేత్రంలో కుట్రగా అంకురించి, శివలింగప్పని దత్తత చేసుకొనే కాలానికి మొక్కగా దినదినాభివృద్ధి చెందింది. చివరి కది కిత్తూరు సంస్థానాన్ని కబళించాలనే గరళప్రాయమైన కుటిలమగు కోరికగా పరిణతి చెందింది.

అటు అధికార లోలుపులగు ధూర్తుల



కలెక్టరు థేకరే కన్నుకూడా కిత్తూరు ఖజానాపై పడింది. ఎలాగైనే సరే కిత్తూరుని కైవసం చేసుకోవాలని థేకరే కలలుగంటున్నాడు. రుద్రసర్జ మృత్యువు అతని కలల కొక రూపకల్పన చేసింది. ఇంకేమి? మిష దొరికింది. వల వన్నాడు. చెన్నమ్మ భావి యువరాజుని దత్తత చేసుకొనే సందర్భంలో అతడుకూడా పిలవని పేరంటంగా కిత్తూరు వచ్చాడు. స్వార్థదృష్టి బరసి చెన్నమ్మ వ్యతిరేకుల్ని గాలించి పట్టుకున్నాడు. అప్పుడే అధికారాన్ని సంపాదించడమే తమ ఏకైక లక్ష్యంగా భావించి దురాశా ప్రేరితులై, యుక్తాయుక్త వివేచనా జ్ఞానాన్ని కోల్పోయి, దేశద్రోహం చేస్తున్నా మనే విషయాన్ని తలంచకుండా ఎల్లప్ప శెట్టి, వెంకట్రావులు థేకరే దొరగారితో రహస్యంగా మంతనాలు జరిపారు. అతని దాసత్వాన్ని స్వీకరించారు!

యువరాజుని దత్తత చేసుకొనే విషయంలో రాణులిద్దరూ తగవులు పడుతున్నారనిన్నీ, అందుచేత రాజోద్యోగు లలోకూడా చీలిక లేర్పడిన కారణంగా అల్లకల్లోలం బయలుదేరి ప్రజల శాంతిభద్రతలకు భంగం కలగవచ్చుననిన్నీ, కాబట్టి దత్తతాధికారమనే ఆచారాన్నే రద్దు చేయింపించాలని, ఆ వనికి శ్రీకారంగా కిత్తూరు సంస్థానాన్ని కంపెనీలో కలిపివేస్తున్నామని కొన్ని అభూత కల్పనలతో అప్పటి గవర్నర్ జనరల్ అయిన డల్‌హౌసీగారికి ఒక లేఖను పంపి థేకరే దొర కిత్తూరుని కబళించి వేశాడు. కోశాగార సంరక్షణకు ఎల్లప్ప శెట్టి, వెంకట్రావులను నియమించి తృప్తిగా ధార్వాడ చేరుకున్నాడు.

తమ కింత అన్యాయాన్ని, అవమానాన్ని కలిగించిన థేకరే కలెక్టరు కుతంత్రతని, దుర్నీతి ధూర్తతలని, నిర్లజ్జాయుత వ్యవహారాన్ని గాంచిన కిత్తూరు రాజోద్యోగులు క్రోధోద్విగ్న మానసులై ఘూర్ణిల్లారు. చెన్నమ్మ రాణి దెబ్బతిన్న నాగిని అయి బుసలు కొట్టింది. తనలోని ప్రత్యణువునుంచి వెల్లుబుకుతూన్న క్రోధాగ్నితో ఆంగ్లేయుల అధికార స్వప్నాన్ని సమూలంగా కాల్చివేయాలని తహతహ లాడారు. కాని, అటువంటి ఆవేశాని కాసమయం అను వైనది కాదు. ఒకవైపు గృహ గౌరవము, ఇంకొకవైపు దేశ స్వాతంత్ర్యము, మరొక వైపు ప్రజాసంరక్షణ! ఈ మూడింటిలో ఏ ఒక్కదానికీ క్షతి కలగకుండా సంయమంతో సావధానులయి మెలి కార్యసాధనకు ఉపక్రమించాలని చెన్నమ్మ రాణి కృతనిశ్చయురా లయింది.

అందుకే యథార్థాన్ని స్పష్ట పరుస్తూ కంపెనీ ఉన్నతాధికారి కొక ఉత్తరం వ్రాసింది. ఉచితమగు న్యాయాన్ని, ప్రజలలో శాంతిభద్రతలు సుస్థిరం చేసేందుకు అతని సహకారాన్ని కోరుతూ, తన హోదాకి ఏ విధమైన భంగం కలగకుండా థేకరేగారికి కూడా ఒక లేఖ పంపింది.

కాని, అసత్యాన్యాయములనే పునాదులపై తమ రాజ్యాన్ని నిలబెట్టు కొంటూ అధికార లోభంతో బధిరులైన ఆ తెల్లదొరల చెవులకు చెన్నమ్మరాణి అనునయ వాక్యాలు వినిపించలేదు. పైపెచ్చు తాము కిత్తూరుపై దండెత్తి వస్తున్నట్టుకూడా వర్తమాన మంపాడు థేకరే దొర!

• • •


అర్ధరాత్రి నిశ్శబ్దం నగరమంతటా ఆవరించింది. అయినా, కిత్తూరు దర్బారు హాలు మాత్రం వేడివేడి ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో ఊగిపోసాగింది. దివాను గురుసిద్దప్పగారితో థేకరేదొర పంపిన లేఖ విషయమై సమాలోచనలు జరుపుతూన్న చెన్నమ్మరాణి కాల గమనాన్నే మరిచిపోయింది.

"దివానుగారూ! అధికార లిప్సతో కూడుకొన్న ఆంగ్లేయుల అత్యాచారాలను సహించి అణిగిమణిగి ఉండే రోజులు మారిపోయాయి. ఈ దేశం లోంచి వారిని పారద్రోలనంతవరకు మేం నిద్రపోం. దానిసత్వపు సంకెళ్ళను విడగొట్టడానికి సశస్త్ర సంగ్రామాన్ని కొనసాగిస్తాం. మా శరీరంలో ఒక్క రక్తపుబొట్టు శేషించినంతవరకు కిత్తూరు రాజ్యం ఆంగ్లేయులకు లొంగదు. . . ఇంక మన ఏర్పాట్లన్నీ చిటికెలో ముగించుకోవాలి. పదండి."

సమాలోచన ముగిసింది.

ఆ రాత్రికి రాత్రే రాణి రాయన్న, బాలన్న, గజవీరుడు, చెన్నవాసప్ప అనే నలుగురు యోధాగ్రేసరుల్ని సైన్య సంచాలకులుగా నియమించింది. నగరంలో ఉన్న ప్రజలందర్నీ కోటలోనే భద్రంగా దాచి, కోటద్వారాన్ని మూయించి వేసింది. బురుజులమీద మరఫిరంగుల్ని ఆయత్తపరిచింది. చారులద్వారా థేకరే దొరగారి సైనిక గమనాన్ని తెలుసు కొంటూనే ఉంది. కొద్ది క్షణాలలో ఆ నగరంపై దురాక్రమణ జరపనున్న ఆంగ్లేయులను ఎదిరించి మాతృదేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించేందుకు సర్వ సన్నద్ధురాలయింది.

ఈలోగా 1824 సెప్టెంబరు 23 ప్రారంభమైపోయింది ప్రత్యూషోదయం



చిత్రం — మునగపాటి శివరామకృష్ణ (హైదరాబాదు)

కాగానే డెబ్బై రెండు దుర్గాలతోను, 358 గ్రామాలతోను కూడిన కిత్తూరు రాజ్యమంతా రణవాద్యాలతో ప్రతిధ్వనించ సాగింది.

ప్రకోపించిన ఆ ఉష్ణవాతావరణంలో ప్రవేశించి తమ ధర్మాన్ని పోగొట్టు కోడం వివేకం కాదని తలంచి కాబోలు, మర్యాదగా అల్లంత దూరంలోంచే కొన్ని శీతలపవనాలు వెనుదిరిగిపోయాయి. కాని, తొందరపడి లోపలికి ప్రవేశించినవన్నీ ఉక్కిరిబిక్కిరి అయినందువల్లనేమో రివ్వున బయటికి పారిపోతున్నాయి. వాటిలో కొన్ని పవనాలు అసలు కనిపించనే లేదు. నామరూపాలు లేకుండా నశించిపోయాయేమో!

సరిగా అదే సమయానికి అయిదు వందల మంది సిపాయిలతోను, శతఘ్నులు మొదలైన మారణాయుధాలతోను, కాప్టెన్ బ్లాక్, కాప్టెన్ సివిల్, లెఫ్టినెంట్ డిగ్టన్‌లనే సేనానాయకులతోను శీతల వాసియగు థేకరే దొర కిత్తూరు రాజ్యాన్ని ధ్వంసం చెయ్యాలనే కుత్సితమగు ద్రోహబుద్ధితో ధార్వాడనుంచి రివ్వున గాలిలాగ దూసుకువచ్చాడు.

కాని, తాము పరిపాలించాలని వచ్చిన ఆ నగరంలో తనకంటె ముందుగా శూన్యమే రాజ్యం చెయ్యడంతో తన నా నగరం వెక్కిరిస్తున్నదని భావించిన థేకరే దొరగారు లోలోపల ఉడికి పోయారు. అందులోంచి ఉబికిన మంటతో చిందులు తొక్కుతూ ఎక్కడలేని ఉద్రేకంతో చెన్నమ్మ రాణిని సంబోధించి, "ఇరవై నిమిషాలే టైమిస్తున్నాం. ఈలోగా మాకు కోటను అప్పగించు. లేదా సర్వనాశనం తప్పదు"


## కాలిపు వీరభద్రుడు

అని గొంతు చించుకొన్నాడు. కాని, జవాబుకి బదులుగా కోటద్వారాన్ని తాకిన తన మాటలే తిరిగి అతని దగ్గిరికి వచ్చాయి.

ఇరవై నిమిషాలు గతించి పోయాయి. ఆ ఉత్తర క్షణంలోనే కోటద్వారం ఛళ్ళున తెరుచుకుంది. తెరుచుకోవడమే తడవుగా రివ్వున బాణంలాగ దూసుకు వచ్చి ఆంగ్ల సైన్యంలో చొచ్చుకు పోయింది వీరపురుషుని వేషంలో ఉన్న చెన్నమ్మ. ఆమె వెనువెంటనే ఆమె రెండు వేల సైన్యమూ వీరావేశంతో బయటికి వచ్చేసింది. ఈ హఠాత్పరిణా మంనుంచి తెల్లదొరలు తేరుకొనేసరికల్లా ఆ ప్రదేశమంతా ఆంగ్ల సిపాయిల శవాలతో నిండిపోయింది. ఈ ప్రచండ వేగాన్ని తట్టుకోవడానికి ఆంగ్లసైన్యం శాయశక్తులా ప్రయత్నిస్తూ పోరు ప్రారంభించింది. కాని, విద్యుత్ వేగంతో చెన్నమ్మరాణి రణక్షేత్రమంతా తానై వ్యాపించింది. మహిషాసుర మర్దిని చండీ దేవిలాగ చండభండనం సలిపింది. భీషణ సంగ్రామం చేస్తూ విలయ తాండవ మొనర్చింది.

ఉప్పొంగిన నదీ కెరటాల్లాగ మహోత్సాహంతో ముందుకు వెళ్ళి ఘోరంగా పోరాడుతున్న తన సైన్యాన్ని ఉద్దేశించి, "దేశమాత వీర పుత్రులారా! మన మాతృభూమిని పరుల చేతుల్లో పడనివ్వరాదు. ఆంగ్లేయులు దీన్ని బలవంతంగా లాక్కోవాలని చూస్తున్నారు. తరతరాలనుంచి ఇది మన జన్మభూమి. అట్టి మన హక్కుని, మన దేశ సంపత్తిని దోచుకోచూచే ఈ తెల్లదొరల్ని పారద్రోలి, మన స్వాతంత్ర్యాన్ని రక్షించుకోవాలి" అంటూ హెచ్చరించింది.

[illegible] తన కరవాలంతో ఆంగ్ల




చిత్రం— మునగపాటి శివరామకృష్ణ (హైదరాబాదు)

సైనికుల కుత్తుక లుత్తరిస్తున్న తమ రాణిని చూచి కిత్తూరు సిపాయిలు ద్విగుణీకృత ఉత్సాహంతో ఆంగ్ల సైనికుల్ని పీనుగుల పెంటగా చెయ్యసాగారు.

కాప్టెన్ బ్లాక్, లెఫ్టినెంట్ డిగ్సన్‌లు వధించబడ్డారు. ఆంగ్ల సైన్యంలో హాహాకారాలు చెలరేగాయి. సైన్యం చీలిపోయింది. వెనక్కి పారిపోసాగింది. పారిపోతూన్న తన సైన్యాన్ని సమీకరించుకొని తిరిగి వచ్చిన థేకరే దొర, రాణి అంగరక్షకుడగు అమటూర్ గుండు దెబ్బతో నిహతుడయ్యాడు. రజ్జువనే భ్రాంతితో పాపం, సర్పాన్ని పట్టుకొన్నట్టయింది థేకరే స్థితి!

స్టీవెన్‌సన్, ఇలియట్ మొదలగు పంథొమ్మిదిమంది ఆంగ్ల సైనికాధికారులు పట్టుబడి పోయారు. అతులిత సాహసానికి వాలి ప్రేమ త్యాగాలకుకూడా ప్రతి మూర్తి అయిన చెన్నమ్మరాణి వారి యెడ ఉదారంగా వ్యవహరించింది. అతిథుల్లాగా వారిని ఆదరించింది. శత్రువులయెడ ఆమె ఎంత కఠినంగా ఉంటుందో, దీనులయెడ అంత ఔదార్యాన్ని చూపిస్తుంది. ప్రజల్ని కన్నబిడ్డల్లాగ చూచే ఆ రాణి దేశద్రోహుల యెడ, ఆతతాయులయెడ మృత్యుదేవతగా పరిణమిస్తుంది. స్టీవెన్‌సన్ మొదలైన ఆంగ్లేయులను సగౌరవంగా పంపించివేసిన రాణి, దేశద్రోహులను ఎల్లప్పశెట్టి, వెంకట్రావులను ఏనుగుచేత మట్టించి చంపించివేసింది!

చెన్నమ్మరాణివల్ల తమ కింతటి ఘోరమైన పరాజయం సంభవిస్తుందని కంపెనీ అధికారులు కలలోకూడా భావించలేదు. రాణికి పట్టుబడిపోయిన తమ సైనికాధికారుల సంగతి ఏమైనదీ కూడా వాళ్లకింకా తెలియలేదు. అందుచేత ఆ వెంటనే కమిషనర్ ఛాప్లిన్, "డిసెంబరు మొదటి తేదీకల్లా మా సైనికాధికారులను విడిచిపెట్టడమే కాకుండా మా అధికారాన్ని ఎవ్వ స్వీకరించాలి. లేదా నీ దుఃస్థితికి నువ్వే దుఃఖించవలసి వస్తుంది" అని చెన్నమ్మకొక లేఖ పంపాడు.

ఛాప్లిన్ లేఖ చెన్నమ్మని రెచ్చగొట్టింది. తానిప్పుడు మళ్లీ యుద్ధానికే పూనుకుంటే అమాయకులగు ప్రజలకు కష్టాలు కలుగుతాయి. అశాంతి వ్యాపిస్తుంది. ప్రవాహరక్తం చిందింపబడుతుంది. ధన ప్రాణాలకి నష్టం వాటిల్లుతుంది. స్త్రీ వృద్ధ బాల లనేకులు అనాథులై పోతారు. మాతృభూమిని రక్షించుకోవాలి. ప్రజానీకానికి హాని కలగకూడదు. అందుచేత మొదటొక లేఖను ఛాప్లిన్ దొరకి పంపాలని రాణి నిశ్చయించింది. ఆ లేఖలో—"థేకరే మహాశయుని తొందరపాటు ఎంత అనర్థానికి దారితీసిందో మనకు తెలిసినదే. అయినప్పటికీ మించిపోయింది లేదు. మీరూ, మేమూ గతాన్ని మరిచిపోదాం. ప్రస్తుతం ఒక్క విషయాన్ని మీకు తెలియజేయడం కర్తవ్యమని భావించి ఈ లేఖను పంపుతున్నాం. నేడు మీరు న్యాయసమ్మతమగు ఔదార్యాన్ని వ్యక్తంచేసి మా కిత్తూరు సంస్థాన స్వాతంత్ర్యంలో చెయ్యి చేసుకోకుండా ఉంటారని ఆశిస్తున్నాం. ప్రజల సుఖశాంతుల్ని కాంక్షించే మేము, యుద్ధాన్ని ఏ నాడూ హర్షించం. కాని, అనివార్యమైన పరిస్థితులే ఉత్పన్నమైననాడు ప్రాణాల్ని బలిచెయ్యడానికి కూడా మేం వెనుకంజ వేయం. మీరు మా ఈ స్నేహభావాన్ని అపార్థం చేసుకోరని మా విశ్వాసం" అని వ్రాసి పంపింది.

నిర్భయ రాజనీతి పాటవము, న్యాయపూర్ణ దృష్టి, ఆత్మాభిమానాలతో కూడిన చెన్నమ్మరాణి ఆ ప్రత్యుత్తరాన్ని కంపెనీవారు గౌరవించలేదు. అక్కడికీ చెన్నమ్మరాణి ఔదార్య సద్భావాల గురించి స్టీవెన్‌సన్, ఇలియట్‌లుకూడా ఎంతగానో చెప్పారు. కాని, ఛాప్లిన్ దొర యుద్ధానికే సిద్ధమయ్యాడు. మద్రాసు బొంబాయి, మైసూరు సైన్యాల్ని కూడా కూడగట్టుకొని 1824 డిసెంబరు 3 న డీకన్ సేనాపతితో సహా కిత్తూరుకోటని ముట్టడించాడు. ఇరుపక్షలవారు తీవ్రంగా పోరాడారు.

కాని, ఈ యుద్ధంలో సర్ థామస్ మన్రో వధించబడ్డంతో ఛాప్లిన్ దొర బెల్గాంవైపు చాపకింద నీరులాగ జారుకొన్నాడు. విజయలక్ష్మి చెన్నమ్మకే దక్కింది.

ఛాప్లిన్ దొర అంతటితో ఆగలేదు. విశాలమగు సేనావాహినితో డిసెంబరు రీ వ మరల కిత్తూరుపై దాడి చేశాడు. ఈసారి కిత్తూరుని వలవక్కలా ఆక్రమించేడు. రాణికూడా 'విజయమో, వీరస్వర్గమో' అని రణరంగంలోకి దూకింది.

కాని అప్పటికే రాణి సైన్యం బాగా తగ్గిపోయింది. గత రెండు యుద్ధాలు జరిగి ఎంతోకాలం కాలేదు. సైన్యాన్ని పోగుచేసుకోవడానికి వ్యవధి లేకపోయింది. మిగిలిన ఆ కొద్దిమంది సైనికులతోనే చెన్నమ్మరాణి యుద్ధానికి సాహసించింది. కాని, వేల ఉవివట్టున్న ఆంగ్లసైన్యం ముందు రాణి సైన్యం క్షణకాలంలో నమసిపోయింది. దీనికి తోడు శివనప్ప అనే దేశద్రోహి ఘాతుక కృత్యం కారణంగా చెన్నమ్మరాణి మరఫిరంగులు సరిగ్గా పనిచెయ్యలేదు.

చెన్నమ్మరాణి పట్టుబడి పోయింది. అయినప్పటికీ తన కుడిభుజమగు రాయన్నకు కనుసన్నచేసి రణభూమి నుంచి తప్పించుకోమని చెప్పింది. రాయన్న అడవుల్లోకి పారిపోయాడు.

కిత్తూరు కోశాగారాన్ని కంపెనీవారు పూర్తిగా కొల్లగొట్టారు. మూడు వేల గుర్రాల్ని, రెండువేల ఒంటెల్ని, వందల కొలది ఏనుగుల్ని, ముప్ఫై ఆరు మరఫిరంగుల్ని, యాభై ఆరువందల తుపాకుల్ని, పదహారు లక్షల నగదు, రత్నాలు, వజ్రాలు, ఆభరణాలు మొదలగు కిత్తూరు సంపదవంతటినీ నాలుగు వందల బళ్లలో మోసుకుపోయారు.

ఇంతటి అసహాయస్థితిలో కూడా దేశభక్తిపూరితుడైన రాయన్న అడవుల్లో దాగొంటూ మరికొన్నాళ్ల వరకు ఆంగ్లేయుల్ని ముప్పుతిప్పలు పెట్టాడు. కాని, కపటోపాయాలతో అతన్నికూడా పట్టుకొన్నారు. ఆంగ్లేయు లతని దేశభక్తిని రాజద్రోహంగా పరిగణించి ఉరి తీయించారు.

బెలహోంగల్‌లో ఖైదు చెయ్యబడ్డ రాణికి ఈ విషయం తెలిసింది. రోగంతో బాధపడుతూన్న ఆమె అలాగే కుప్పకూలిపోయింది ... కిత్తూరురాణి చెన్నమ్మ అంతమై పోయింది!

కాని, ఆమె ప్రాణజ్యోతి మాత్రం అనంత నీలాకాశంలో ఆరని జ్యోతిగా వెలుగుతూ దేశమాత దాస్యశృంఖలాల్ని తెంచమని భారతీయుల్ని హెచ్చరిస్తూ 1857 నాటి స్వాతంత్ర్య సమరానికి నాందిభూతమై అమరత్వాన్ని పొందింది! ★